

సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

సర్కారు దవాఖానాలకు బ్రాండింగ్

మెరుగైన సేవలకు అవసరమైన సౌకర్యాల కల్పన

ఆకర్షణీయంగా కనపడేలా మెరుగులు

ఉమ్మడి జిల్లాలో 8 ఆస్పత్రుల ఎంపిక

రెండు నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశం

నేటి నుంచి ఆస్పత్రులకు ఇంజనీరింగ్ అధికారులు

సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సర్కారు దవాఖానాలకు 'బ్రాండింగ్' చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమస్యలను పరిష్కరించి, మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిపై హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు రాష్ట్రంలోని అన్ని సర్కారు ఆస్పత్రుల అధికారులు, టీజీఎంఎస్ఐడీసీ అధికారులతో సోమవారం సమీక్షించి కార్యాచరణ రూపొందించారు. సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎనిమిది ఆస్పత్రుల దశ మారనుంది.

ఉమ్మడి జిల్లాలో ఎనిమిది ఆస్పత్రులు

బ్రాండింగ్ ప్రక్రియలో భాగంగా మొదటి దశలో చేపట్టే పనులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎనిమిది ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఇందులో డీఎంఈ కింద ఉన్న దవాఖానాలు మూడు, టీవీవీపీ కింద ఉన్న ఆస్పత్రులు ఐదు ఎంపికయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో నాలుగు, మెదక్ జిల్లాలో రెండు, సిద్దిపేట జిల్లాలో రెండు ఆస్పత్రులను ఎంపిక చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జీజీహెచ్ సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. మెదక్ జిల్లాలో మెదక్ జనరల్ హాస్పిటల్, నర్సాపూర్ ఏరియా ఆస్పత్రి, సిద్దిపేట జిల్లాలోని జీజీహెచ్ సిద్దిపేట, గజ్వేల్ ఏరియా ఆస్పత్రులున్నాయి. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా ఆస్పత్రుల్లో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు.

చేపట్టే పనులు ఇవే..

ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో భద్రతా నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, డ్యూటీ రూమ్, సీసీటీవీ, సెక్యురిటీ అవుట్‌పోస్ట్, రెడ్‌అలారం ఏర్పాటు చేస్తారు. పేషెంట్లకు కల్పించే సౌకర్యాల్లో భాగంగా టాయిలెట్స్, క్యాంటిన్, డ్రింకింగ్ వాటర్, రిసెప్షన్ ఏరియా, బయోమెడికల్ వేస్ట్ డిస్పోసల్, ల్యాండ్‌స్కేపింగ్, ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్, డ్యాష్ బోర్డులు, ఓపీ, ఫార్మసీ, డయాగ్నోస్టిక్ ప్రత్యేక కౌంటర్లు, నిర్మాణాత్మక మరమ్మతులు, రోగులకు స్పష్టంగా తెలిసేలా గుర్తులు ఏర్పాటు చేస్తారు. డీఎంఈ పరిధిలోని జనరల్ ఆస్పత్రుల్లో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం

మిగతా 7వ పేజీలో

తపాలా.. భళా



మెదక్‌లో తిరంగా ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు

జవాన్ల కుటుంబాలకు అండగా ఉంటాం

ఢిల్లీలో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై మంగళవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకున్న చర్యలను వివరించారు.



మెదక్-ఎల్కతుర్తి హైవే నిర్మాణంలో భాగంగా సందిల్ల వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు నత్తనడకన సాగుతున్న దృశ్యం

పెద్దరోడ్డు ఇంకెప్పుడో?

మెదక్ జిల్లా కేంద్రం నుంచి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2022 నవంబరులో ప్రారంభమైన ఈ పనులు నేటికీ కొలిక్కిరాలేదు. రెండేళ్లలో పూర్తికావాల్సిన పనులు.. మరో ఆరు నెలలైనా పూర్తయ్యేలా కనిపించట్లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎక్కడా హెచ్చరికలు, సూచికబోర్డులు లేకుండానే అస్తవ్యస్తంగా పనులు కొనసాగిస్తున్నారు. అసంపూర్తి నిర్మాణాలతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారు. ఈ రహదారి నిర్మాణ పనులను మంగళవారం 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా పలు విషయాలు వెలుగుచూశాయి.

కొనసాగుతున్న మెదక్-ఎల్కతుర్తి హైవే పనులు

పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా 133 కి.మీ.ల రోడ్డు నిర్మాణం

అసంపూర్తిగా పనులు.. తరచూ రోడ్డు ప్రమాదాలు

ఇప్పటికే పలువురి మృత్యువాత.. అయినా మారని తీరు

హెచ్చరికలు, సూచికబోర్డులు లేకుండానే పనుల నిర్వహణ



రామాయంపేట మండలం అక్కన్నపేట వద్ద సైడ్ డ్రెయిన్‌లో పడిపోయిన లారీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి), మే 20 : మెదక్ నుంచి సిద్దిపేట మీదుగా ఎల్కతుర్తి వరకు ఉన్న రహదారికి మూడేళ్ల క్రితం జాతీయ హోదాను కల్పిస్తూ హైవే 765-డీజీ నంబరును కేటాయించారు. విస్తరణ పనులు చేపట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ రహదారిని రెండు ప్యాకేజీలుగా విభజిస్తూ టెండర్లు నిర్వహించి పనులు కూడా చేపట్టారు. ఒకటో ప్యాకేజీలో మెదక్ నుంచి సిద్దిపేట వరకు 70కి.మీ.లకు రూ.882 కోట్లు, రెండో ప్యాకేజీలో సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు 63 కి.మీ.ల రహదారి నిర్మాణానికి రూ.578 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

జాతీయ రహదారి పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడినట్లు స్పష్టమవుతోంది. పనులు ప్రారంభమైన నాటి నుంచే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రమపద్ధతిలో కాకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనుల నిర్వహణతో దుమ్మూధూళి

మిగతా 7వ పేజీలో

వదలని వాన



గోప్యానాయక్ తండాలో ఎగిరిపోయిన రేకులు



నారాయణఖేడ్ మండలం పలుగు తండాలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు



సంజీవన్‌రావుపేటలో పిడుగుపాటుకు మృతిచెందిన గేదె

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/జోగిపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతులను వదలడం లేదు. సంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్‌స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. నారాయణఖేడ్ డివిజన్‌లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఖేడ్ మండలం ర్యాకల్ సబ్‌స్టేషన్ నుంచి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ విద్యుత్‌లైన్ ఏడు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో పలు గ్రామాలు, తండాలకు సరఫరా నిలిచిపోయింది. పలుగు తండాలోని పలు గృహాల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, ఆర్ఐ మాధవరెడ్డి తండాలో పర్యటించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంజీవన్‌రావుపేటలో పిడుగుపాటుకు గ్రామానికి చెందిన సట్టి నర్సయ్య గేదె మృతిచెందింది.

నాగల్‌గిద్ద మండలం గోప్యానాయక్ తండాలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అందోల్ మండల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి 28 వరకు పరీక్షలు
- సంగారెడ్డి జిల్లాలో 28 కేంద్రాలు, 14,379 విద్యార్థులు



సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్

సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈవో) గోవిందరామ్ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 28 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 28 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 14,379 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. సప్లిమెంటరీ పరీక్షలపై సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో డీఐఈవో గోవిందరామ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈసీ, హెచ్‌పీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

ఈ నెల 23న జహీరాబాద్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నిమ్జ్ రోడ్డు, కేంద్రీయ విద్యాలయం ప్రారంభం



హెలిప్యాడ్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది

జహీరాబాద్/ఝరాసంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌లో ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పట్టణంలోని అల్గోల్ బైపాస్ చౌరస్తా వద్ద హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లు పనులు చకచకా కొనసాగుతున్నాయి. సీఎం ప్రారంభించనున్న బసవేశ్వర విగ్రహం, ఝరాసంగం మండలంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద ఏర్పాట్లను సంగారెడ్డి ఎస్పీ పరితోష్‌పంకజ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. 65వ జాతీయ రహదారి నుంచి బర్దీపూర్ వరకు 9 కిలోమీటర్ల మేర నిర్మించిన నిమ్జ్ రోడ్డును సీఎం ప్రారంభించనున్నారు. జహీరాబాద్ నుంచి కేంద్రీయవిద్యాలయం వరకు రోడ్లకు మరమ్మతులు చేసి వంతెనలకు రంగులు వేశారు.



సీఎం ప్రారంభించనున్న నిమ్జ్ రోడ్డు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సీఎం పర్యటన చరిత్రలో నిలిచిపోవాలి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గంలో సీఎం పర్యటనను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యటనలో భాగంగా సీఎం బసవేశ్వర విగ్రహావిష్కరణ, కేంద్రీయ విద్యాలయ నూతన భవనం, మహిళా పెట్రోల్ బంకు ప్రారంభిస్తారని. పలు ఇతర కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు. పర్యటన రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడి పలు సూచనలు చేశారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిజాం షుగర్స్‌పై వీడని సందిగ్ధత

యూనిట్ పునరుద్ధరణలో కొరవడిన స్పష్టత

వన్‌టైం సెటిల్‌మెంట్ కింద బ్యాంకులకు రూ.190 కోట్లు చెల్లించిన సర్కారు



మంబోజిపల్లి యూనిట్‌లో పాడైన యంత్రాలు

మెదక్, మే 20 (ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలను డిసెంబరు నాటికి పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగడం లేదు. కర్మాగారాలను తిరిగి ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ వైస్ చైర్మన్‌గా, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో పాటు ఏడుగురు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గత సంవత్సరం కమిటీ సభ్యులు మెదక్ (మంబోజిపల్లి), బోధన్ (షక్కర్‌నగర్), ముత్యంపేట(మెట్‌పల్లి) ఎన్డీఎస్ఎల్ యూనిట్ల పరిధిలో పలుమార్లు పర్యటించి, రైతులతో మాట్లాడి సమాచారం సేకరించారు. అధికారులు, నిపుణులతో చర్చించారు. సుదీర్ఘ అధ్యయనం అనంతరం యూనిట్ల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. సబ్‌కమిటీ సూచించిన విధివిధానాల ప్రకారం ప్రక్రియ కొనసాగించినా యూనిట్లను ఇప్పట్లో ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు.

ఇదీ నేపథ్యం..

ప్రభుత్వం నడుపుతున్న నిజాం షుగర్స్ కర్మాగారాలు నష్టాలు చవిచూడడంతో 2002లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో నడపాలని నిర్ణయించారు. ఓ పారిశ్రామికవేత్త 49 శాతం, ప్రభుత్వం 51 శాతం వాటాలతో ఫ్యాక్టరీ కొన్నిరోజులు కొనసాగింది. తదనంతరం జరిగిన పరిణామాలు, నష్టాల కారణంగా యాజమాన్యం 2015 డిసెంబరులో లేఆఫ్ ప్రకటించింది. ఆయా యూనిట్లలో పనిచేస్తున్న వేలాది కార్మికులు ఉపాధిని కోల్పోయారు. న్యాయం చేయాలని కార్మికులు ఆందోళనలు చేశారు. లేబర్ కోర్టుకు వెళ్లారు. ఢిల్లీలోని ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. అనంతరం తెలంగాణ తొలి ప్రభుత్వం కో-ఆపరేటివ్ పద్ధతిలో నిర్వహించాలని సూచించినా రైతులు ముందుకురాలేదు. అనంతరం 2018లో లాట్రిబ్యూనల్ ఎదుట ప్రభుత్వం విక్రయించకుండా మరో మార్గం సూచిస్తామని, 18 వారాల గడువు కోరింది. అయినా సర్కారు నుంచి స్పష్టత రాకపోవడంతో ఫ్యాక్టరీలను విక్రయించాలని ఆదేశించింది. తదుపరి చర్యలు నిలిచిపోయాయి. తదనతరం దివాలా ప్రకటిస్తూ లిక్విడేట్ చేయాలని నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యూనల్‌ను మేనేజ్మెంట్ అభ్యర్థించింది. అనంతరం గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రస్తుత ప్రభుత్వం తిరిగి యూనిట్లను తెరవడానికి ప్రయత్నాలు ప్రారంభించింది.

రూ. 400 కోట్ల అప్పులు.. రూ.190 కోట్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

తాజాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ అధ్యయనంలో నిజాం డెక్కన్ షుగర్స్ కర్మాగారాలు మూతపడేనాటికి రూ.400 కోట్లు వివిధ బ్యాంకుల వద్ద అప్పులు చేసినట్లు తేలింది. ప్రభుత్వం బ్యాంకర్ల కన్సార్టియంతో సంప్రదింపులు జరిపి వన్‌టైమ్ సెటిల్ మెంట్ కింద రూ.190 చెల్లించడంతో ఫ్యాక్టరీ యూనిట్లు అప్పుల ఊబి నుంచి బయటపడ్డాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.171 కోట్లు చెల్లించగా, ఎన్డీఎస్ఎల్ ప్రైవేటు భాగస్వామి రూ.19 కోట్లు చెల్లింపులు చేశారు. డిసెంబర్ నాటికి నిజాం చక్కెర కర్మాగారాలను తిరిగి తెరిపిస్తానని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ, అందుకు సంబంధించిన కార్యాచరణ ముందుకు సాగడం లేదు. దీంతో రైతులు ఇప్పటి వరకు చెరుకు పంట వేయలేదు. ఒక వేళ ఫ్యాక్టరీలను ప్రారంభించినా గానుగ ఆడించడానికి చెరుకు లేదు. ప్రస్తుతం ఫ్యాక్టరీల్లో ఉన్న యంత్రాలు తిరిగి నడిపించే అవకాశం లేదని తెలుస్తున్నది. పాత యంత్రాలకు మరమ్మతులు చేయాలా? కొత్తవి కొనుగోలు చేయాలా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇటువంటి గందరగోళ పరిస్థితుల్లో నిజాం షుగర్స్ ప్రారంభం ఇప్పట్లో ఉండే కనిపించడం లేదు.

అప్పు తీర్చాలని సొంత చెల్లి ఇంటికే తాళం వేసిన అన్న

- బావపై దాడి చేయడంతో మనస్తాపంతో అదృశ్యం
- ఈ నెల 17న ఘటన.. అప్పటి నుంచి బిడ్డతో కలిసి ఆరుబయటే ఉంటున్న మహిళ
- మంగళవారం పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



ఇంటికి తాళం వేయడంతో బయట ఉన్న గీత , గణేష్ (ఫైల్)

శివ్వంపేట, మే 20(ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు తీర్చడం లేదని తోడబుట్టిన చెల్లెలు ఇంటికి తాళం వేయడంతోపాటు బావపై దాడి చేశాడు ఓ వ్యక్తి. దీంతో మనస్తాపం చెందిన బావ అదృశ్యమయ్యాడు. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి లోని దొంతి గ్రామానికి చెందిన గోత్రాల గణేష్ ఐదేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం తన బావమరిది గోత్రాల బాల్ నర్సయ్య వద్ద 1.50 లక్షలు అప్పు తీసుకున్నాడు అప్పు తీర్చే మార్గం లేక గణేష్ ఈ నెల 17న ఉదయం మస్కట్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసు కున్న బాల్ నర్సయ్య అతడి ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వమని అడగడంతో పాటు బావపై దాడి చేసి ఇంటికి తాళం వేశాడు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ బయటికెళ్లి తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య గీత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఆరోజు నుంచి గణేష్ భార్య ఇంటి వద్ద ఆరుబ యటనే బిడ్డతో కలిసి ఉంటున్నది. తన అన్న బెదిరింపులకు పాల్పడుతు న్నాడని, అతడితో ప్రాణహాని ఉందని బాధితురాలు తెలిపింది.

ఫర్టిలైజర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. 3 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన పత్తి విత్తనాలు

కల్హేర్, మే 20(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ గ్రామంలోని ఫర్టిలైజర్, విత్తనాల దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకు న్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పవన్‌రెడ్డి శివశక్తి పేరున ఫర్టిలైజర్, విత్తనాల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లిన అనంతరం రాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించి బయటికి పొగ రావడంతో స్థానికులు షాపు యజమానికి సమాచారమం దించారు. షాపు తెరిచి చూసే సరికి పత్తి విత్తనాల ప్యాకెట్లు, కంప్యూటర్లు, ఈ పాస్ మిషన్, ఫర్నీచర్, షాపు లైసెన్స్ పేపర్లు ఇతర నిర్వహణ రికా ర్డులు దగ్ధమయ్యాయి. జరిగిన ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని పవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సిర్గా పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెండు నెలల క్రితం అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం



బాల మల్లవ్వ (ఫైల్)

చిన్నశంకరంపేట మే 20 (ఆంధ్రజ్యోతి): అదృశ్య మైన మహిళ మృతదేహం రెండు నెలల తర్వాత లభ్య మైంది. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చోటుచేసు కుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండలం రజాక్ పల్లి గ్రామానికి చెందిన వజ్జ బాల మల్లవ్వ(55) గత మార్చి నెలలో చిన్నశంకరపేట మండలం బాగిర్తిపల్లి బంధువుల వద్దకు బీరప్ప జాత రకు వచ్చింది. ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బాల మల్లవ్వ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారిని, బంధువులను అడిగినా ఫలితం దక్కలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నారు. కాగా, మంగళవారం సూరారం గ్రామ శివారు అటవీ ప్రాంతం వైపు వెళ్లిన గ్రామస్థులకు ఓ గుర్తు తెలియని మహిళా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లిన వారు కుళ్లి పోయి అస్థిపంజరం స్థితిలో లభ్యమైన శవాన్ని పరిశీలించి బాల మల్లవ్వ మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని అక్కడే పోస్టుమార్టం చేసినట్లు ఎస్ఐ నారాయణ గౌడ్ వెల్లడించారు.

రాంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

- మానవత్వాన్ని చాటిన పోలీస్ కళాబృందం



గాయపడిన భార్యాభర్తలను ఆస్పత్రిలో చేర్పిస్తున్న పోలీస్ కళా బృందం

నంగునూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైన సంఘ టన సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. ఈ ప్రమాదంలో హుస్నా బాద్ మండలం నవీపేట గ్రామానికి చెందిన అనిల్, మౌనిక గాయాలకు గురయ్యారు. రోడ్డు పక్కన ఉన్న గుంతలో భార్యాభర్తలు పడిపోగా ఆ సమ యంలో అక్కన్నపేట మండలంలో పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల డ్రైవర్ శ్రీనివాస్‌లు విధులు ముగించుకొని వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి ఉన్న భార్య భర్తలను గుర్తించి వారిని వెంటనే సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి గురైన భార్యాభర్తలను పోలీసులు తమ వాహనంలో ఎక్కించుకొని ఆసుప త్రిలో చేర్పించి వారి బంధువులకు సమాచారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అర్ధరాత్రి తర్వాత ఆపదలో రక్త గాయాలతో ఉన్నవారిని ఆసుపత్రిలో చేర్పించి వారి బంధువులకు సమాచారం ఇచ్చిన పోలీస్ కళా బృందానికి బాధ్యత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

40 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం లారీతో విజిలెన్స్ డీఎస్పీ, సిర్గాపూర్ ఎస్ఐ

కల్హేర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : గుట్టు చప్పుడు కాకుండా లారీలో కర్ణా టక రాష్ట్రానికి తరలి స్తున్న 40 టన్నుల రేషన్ బియ్యం లారీని సీజ్ చేసి డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు సిర్గా పూర్ ఎస్ వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిర్గాపూర్ మండల పరిధి లోని పోచాపూర్ చౌరస్తాలో సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చౌరస్తా మీదుగా వెళ్తున్న కర్ణాటకకు చెందిన లారీని అనుమానం వచ్చి ఆపి తనిఖీలు చేయగా 40 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ విషయం పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ వారికి సమాచారమివ్వడంతో సివిల్ సప్లై డీటీ సాజుద్దీన్, విజిలెన్స్ డీఎస్పీ వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పట్టుబడిన బియ్యం పరిశీ లించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. వారు ఫిర్యాదు చేయడంతో లారీ ఓనర్ జాకిర్ మియా, డ్రైవర్ అనిల్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మద్యం లోడు డీసీఎం బోల్తా.. డ్రైవర్ మృతి



హత్నూర, మే 20 (ఆంధ్రజ్యోతి): మద్యం బీరు కాటన్‌ల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపు తప్పి బోల్తా పడగా డ్రైవర్ మృతి చెందిన సంఘటన హత్నూర మండలం చందాపూర్ బస్టేజి సమీపంలో సంగారె డ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పుల్కల్ మండలం శివ్వంపేట గ్రామ శివారులోని బీర్ ఫ్యాక్టరీ నుంచి 1675 రాయల్ చాలెంజ్ బీర్ కాటన్ల లోడుతో కరీంనగర్ లిక్కర్ డిపోకు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా చందాపూర్ గేటు సమీపంలోని వద్ద ఎదు రుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రవీణ్ (22) మృతి చెందగా.. క్లీనర్ ముజామిద్ ప్రాణాలతో బయటపడ్డాడు. వీరిద్దరు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా చింతకి గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకొని ఎక్సైజ్ ఎస్ఐ సందీప్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి సైతం సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. డ్రైవర్ మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఆటో డ్రైవర్ మృతి



అశోక్ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. వివ రాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్(20) మంగళ వారం రాత్రి హుస్నాబాద్ నుంచి గట్లనర్సింగాపూర్ గ్రామానికి ఆటో నడుపుకుంటూ వెళ్తున్నాడు. హుస్నా బాద్ మండలం జిల్లెలగడ్డ సమీంలో వరంగల్ నుంచి వస్తున్న కారు అతడిని ఆటోను ఢీకొట్టడంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

జగదేవ్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని కారు ఢీకొన డంతో వృద్ధుడుమృతి చెందిన ఘటన జగదేవ్‌పూర్ మండలం అల్లిరాజ పేట్, నిర్మల్‌నగర్ గ్రామాల మధ్య మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అలిరాజపేట్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు(65) నిర్మల్‌నగర్‌లోని పీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నిర్మల్‌నగర్ వద్ద మంగళవారం ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అల్లిరాజపేట్ గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగి అక్క డికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయాలపాలై చికిత్స పొందుతూ వ్యక్తి ..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చేగుంట, మే 20(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండల రెడ్డిపల్లి బైపాస్ 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి 44 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..



రాములు వ్యక్తి మృతదేహం

జోగిపేట రూరల్, మే20(ఆంధ్రజ్యోతి): అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ పాండు తెలిపిన వివ రాల మేరకు అల్లాదుర్గం మండలం గడిపె ద్దాపూర్ గ్రామానికి చెందిన దానంపల్లి రాములు శుభకార్యానికి ద్విచక్రవాహ నంపై వెళ్తుండా అన్నసాగర్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాములు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడితో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య



రాజు మృతదేహం

తొగుట, మే 20 (ఆంధ్రజ్యోతి): తమ్ముడితో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచే సుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రామారం రాజు (38)కి తల్లిదండ్రులు 20 ఏళ్ల క్రితమే మృతిచెందారు. అతడికి చెల్లె మమత, తమ్ముడు మహేశ్ ఉండగా ఇరువురికి వివాహం జరిగింది. రాజు మద్యా నికి బానిస కావడంతో అతడికి ఎవరూ పిల్లను ఇవ్వకపోవడంతో ఒంట రిగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాజు తన తమ్ముడితో చిన్న పాటి గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజు జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

జోగిపేట రూరల్, మే20(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువ కుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ మండలం సంగుపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు కథనం ప్రకారం నారా యణఖేడ్‌కు చెందిన బానాపురం రాకేశ్(27) ఆర్థిక ఇబ్బందులతో మన స్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడాడు. మృతుడి తల్లి ముక్తాబాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మక్తలక్ష్మాపూర్‌లో పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

పెద్దశంకరంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలో మక్తలక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. పెద్దశంకరంపేట మండల ప్రాంతంతో పాటు కల్హేర్ కమిటీ నారాయణఖేడ్, మనూరు, కర్ణాటక, మహారాష్ట్ర పరిధిలోని మల్ల యోధులు కుస్తీ పోటీలో పాల్గొన్నారు. దీంతో కుస్తీ పోటీలు రసవత్తరంగా మారాయి. లక్ష్మాపూర్ గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పోటీలను తిలకించడానికి తరలివచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వీ హబ్‌తో గీతం ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న ఇరు వర్గాల ప్రతినిధులు

పటాన్‌చెరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మహిళా వ్యవస్థాపకుల కోసం నెలకొల్పిన వీ హబ్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాయం ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కృతి గుప్తా, వీ హబ్ డైరెక్టర్ (సామాజిక ప్రభావం, వ్యవస్థాపకత) జాహిద్ అక్బర్ షేక్‌లు సంతకాలు చేశారు. మహిళలు నడిపే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈలు) ముందుకు తీసుకెళ్లడంలో, ఈ ప్రాంత వృద్ధిని వేగవంతం చేయడంలో ముందడుగు వేసేందుకు ఇది కీలకం కానుంది. కార్యక్రమంలో వీ హబ్ సీఈవో పి.సీత, వీడీసీ కోచ్‌లు, ఈ-క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విభాగాధిపతులు, బీబీఏ విద్యార్థి వలంటీర్లు పాల్గొన్నారు.

తపాలా.. భళా



- నేటికీ తగ్గని ప్రజల ఆదరణ
- సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు
- విస్తరిస్తున్న మొబైల్ సేవలు
- ఒక్క క్లిక్‌తో ఇంటి వద్దకే సర్వీస్
- మెదక్ జిల్లాలో 285 పోస్టాఫీసులు

మెదక్ అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగుతోంది. ప్రజలకు సేవలందించడంలో తగ్గేదేలా అన్నట్లుగా తన పరిధిని విస్తరించుకుంటూ పోతుంది. పాతతరం పద్ధతులను పక్కనపెట్టిన నూతన ఒరవడితో ప్రత్యేకతను చాటుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల ఆలోచనలకు తగ్గట్టుగా సేవలందిస్తోంది. ఎన్నో రకాల కొరియర్ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ నేటికీ తపాలా శాఖ ద్వారానే ఉత్తరాలు, పార్సిల్‌లు ప్రజలకు అందుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఆధార్ నుంచి పాస్‌పోర్టు వరకు ఎన్నో సేవలను అందిస్తూ.. వినియోగదారులకు మరింత చేరువవుతోంది.

నూతన పద్ధతులతో..

డిపాజిట్ల సేకరణలో నూతన పద్ధతులను అవలంబిస్తోంది. తపాలా శాఖ ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చి, దాని ద్వారా దాదాపు ఎనిమిది రకాల సేవలను పొందే సౌకర్యం కల్పించింది. యాప్ ద్వారా ప్రీమియం, వివిధ రకాల డిపాజిట్లపై వడ్డీ లెక్కలు వెంటనే తెలుసుకునే అవకాశం ఉంది. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీని ద్వారా సుకన్య సమృద్ధి యోజన పథకంతోపాటు రికరింగ్ డిపాజిట్‌లో ఏడాది నుంచి ఐదేళ్ల వరకు చేసే డిపాజిట్లపై ఆదాయాన్ని తెలుసుకోవచ్చు.

ఇంటి వద్దనే సేవలు...

ప్రజలు పోస్టాఫీస్‌కు రాకుండానే ఇంటి వద్దనే సేవలు అందించే విధంగా తపాలా శాఖ నూతన పద్ధతులను తీసుకొచ్చింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నెట్‌వర్క్‌లను ప్రజలకు చేరువ చేసింది. గతంతో వయోవృద్ధులు పోస్టాఫీసు వద్ద క్యూలో నిలబడేవారు. అయితే ప్రస్తుతం తపాలా శాఖ అందిస్తున్న సేవలతో ఇంటి వద్దనే పోస్ట్‌మెన్‌లతో సేవలు పొందుతున్నారు. డబ్బు చెల్లించడం నుంచి డబ్బు విత్‌డ్రా, ట్రాన్స్‌ఫర్ తదితర వాటిని ఆన్‌లైన్‌లోనే పూర్తి చేసుకుంటున్నారు. వినియోగదారులకు ఎటువంటి సేవలు కావాలో సమీప పోస్టాఫీసులో తెలుసుకోవచ్చు.

అందిస్తున్న సేవలివే..

ప్రాంతాల పిన్‌కోడ్ ఆధారంగా మనకు కావాల్సిన పోస్టాఫీసు ఎక్కడ ఉంది. ఏ డివిజనలో ఉంది. ఏ ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. పోస్టేజీ కాలిక్యులేటర్ ద్వారా వినియోగదారులు పంపిచే పార్శిళ్లు, పోస్టల్ కవర్లు, ఎంత బరువుకు ఎంత చెల్లించాలి, సాధారణ స్పీడ్ పోస్టుల్లో పంపిస్తే ఎంత ఖర్చు అవుతుందనే విషయాన్ని సులభంగా స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఫీడ్‌బ్యాక్ ద్వారా పోస్టల్ సేవలకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే వివరంగా తెలుసుకునే అవకాశం ఉంది. సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం కూడా కల్పించింది. ఇంట్రస్ట్ కాలిక్యులేటర్ ద్వారా ఏ పథకానికి ఎంత వడ్డీ వస్తుంది.. ఎంత మొత్తం పొందవచ్చు, ఆర్టికల్ ట్రాకింగ్ వినియోగదారులు పంపిన స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టు, పార్సిల్, ఈఎంవో ఎక్కడ ఉన్నాయి.. ఎప్పుడూ చేరతాయో తెలుకునేందుకు ఇది ఉపయోగపడుతోంది. కంప్లెంట్ ట్రాకింగ్ ద్వారా వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులు ఏ దశలో ఉన్నాయి.. దానికి సంబంధించిన సమాచారం ఇంకా ఎవైనా కావాలా అనే అంశాలు తెలుస్తాయి. ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా తపాలా శాఖ అందిస్తున్న వివధ రకాల బీమా పథకాల సమాచారం తెలుస్తోంది. సర్వీస్ రిక్వెస్ట్ ద్వారా ఇంటి వద్ద లభించే సేవల సమాచారం తెలుసుకోవచ్చు.



మెదక్ ప్రధాన తపాలా కార్యాలయం

సేవలను వినియోగించుకోవాలి..



తపాలా శాఖలో అందరికీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నాం. చిన్నారుల దగ్గర నుంచి వయోవృద్ధుల వరకు వివిధ రకాల పథకాల సేవలు పొందవచ్చు. డిపాజిట్లపై మెరుగైన వడ్డీ వస్తుంది. ఎన్ని వచ్చినా తపాలాశాఖకు వచ్చే ప్రజల సంఖ్య తగ్గడం లేదు. ఆధార్ సెంటర్‌ను కూడా ప్రారంభించాం. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీహరి, మెదక్, డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్

అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సుకు మల్లేశం



మల్లేశం

సంగారెడ్డి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సుకు భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డు సభ్యులు సుంకరి మల్లేశం ఎంపికయ్యారు. ప్రపంచంలోని 187 సభ్యదేశాలు పాల్గొనే 113 అంతర్జాతీయ కార్మిక సదస్సుకు మల్లేశంను భారత ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 31 వ తేదీ నుంచి జూన్ 15 వ తేదీ వరకు జరిగే సదస్సులో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ, కేంద్ర ఉపాధి శాఖ అధికారులు, కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాల నాయకులు, కేంద్ర యాజమాన్యాల సంస్థ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

వన్‌టైమ్ చాన్స్

● 2015-20 మధ్యలో డిగ్రీ ఫెయిలైన వారికి అవకాశం

సిద్దిపేట కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : 2015 నుంచి 2020 మధ్య డిగ్రీ చదివి ఉత్తీర్ణులు కానివారి కోసం వన్‌టైమ్ చాన్స్ కింద పరీక్షలు రాసుకోవడానికి విశ్వవిద్యాలయం కళాశాలకు అనుమతి ఇచ్చిందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. సునిత ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలకు సంబంధించి ఒకటి నుంచి ఆరు సెమిస్టర్లలో ఫెయిలైన విద్యార్థులందరూ ఈ పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి జూన్ 20 వరకు అవకాశం ఉందని, అపరాధ రుసుముతో జూన్ 25 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కళాశాలలోని పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలను కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్. గోపాల సుదర్శనాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల ఉనికికే ప్రమాదం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



సంగారెడ్డిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల ఉనికికే ప్రమాదంగా మారిందని దాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర, జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాలను దెబ్బతీసేందుకు లేబర్ కోడ్‌లను కరోనా కాలంలో పార్లమెంటులో ఆమోదించారన్నారు. ఈ కోడ్‌ల కారణంగా కార్మికులకు ఎలాంటి చిన్న సదుపాయం కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె దేశంలో యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జూలై 9కి వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ. సాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు బాగారెడ్డి, ప్రవీణ్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ లీగ్ పోటీలు



తూప్రాన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

తూప్రాన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. రెండోరోజు మంగళవారం లీగ్ దశ పోటీలు ముగిసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణగుప్తా తెలిపారు. లిగ్ దశ పోటీల్లో వివిధ జిల్లాల జట్లు పోటీ పడ్డాయి. పోటీల్లో మెదక్, నిజామాబాద్, వరంగల్, హనుమకొండ, మంచిర్యాల, నిర్మల్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జట్లు క్వార్టర్ ఫైనల్ పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు.



శ్మశానటికకు దారేది?

●వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన

రామచంద్రాపురం టౌన్ మే 20 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన శ్మశానవాటికకు ఆనుకొని కాలువ ఉంది. అంతిమసంస్కారాలకు వెళ్లాలంటే వంతెన దాటాల్సి ఉంటుంది. ఎవరైనా గ్రామస్థులు చనిపోయిన సందర్భాల్లో పాడే మోసుకుంటూ కాలువపై నిర్మించిన వంతెన పైనుంచి నడుచుకుంటూ వెళ్తుండేవారు. ఏడాది క్రితం కురిసిన వర్షాలకు వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. గ్రామానికి ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. దాన్ని నిర్మించకుండా అలానే వదిలిపెట్టారు. దీంతో శ్మశానవాటికలోకి వెళ్లేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో విడుదలయ్యే చెత్తను కాలువలో పోసి దారిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అందులోనుంచే పాడే మోసుకుంటూ లోనికి నిదానంగా వెళుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మించాలంటే రూ.40 లక్షలు ఖర్చవుతుందని పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి చెప్పారు.

సర్కారు దవాఖానాలకు బ్రాండింగ్

(5వ పేజీ తరువాయి)

సీటీ, ఎంఆర్ఐ స్కాన్‌లు, బ్లడ్ కాంపోనెంట్ సపరేటర్ ఉండేలా సమకూర్చుతారు. అంతే కాకుండా అడ్మినిస్ట్రేటివ్ వింగ్ పరంగా మార్పులు చేర్పులు చేస్తారు. తొలుత బ్యాండింగ్ చేయాల్సిన ఆస్పత్రులను టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కల్పించాల్సిన వసతులపై ఆరా తీసి నివేదిక రూపొందిస్తారు. ఆ తర్వాత ఉన్నతాధికారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తారు. కాగా రెండు నెలల్లోనే ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో బ్రాండింగ్ పనులు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఏదేమైనప్పటికీ బ్రాండింగ్‌తో ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక హంగులు రూపుదిద్దుకోనున్నాయి.

నల్లబ్యాడ్జీలతో 'ఆరోగ్య మిత్ర'ల నిరసన



జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీ . దరించి విధులకు హాజరైన ఆరోగ్య మిత్ర

సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు మళ్లీ నిరవధిక సమ్మెలో వెళ్లే యోచనలో ఉన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గతేడాది ఆరోగ్య మిత్రలు సమ్మె చేశారు. ఆ క్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్య మిత్రలకు డాటా ఎంట్రీ ఆపీసర్ క్యాడర్ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో మళ్లీ ఆరోగ్య మిత్రలు సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్ర హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని లేకపోతే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు.

64 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ



సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్‌జమల్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నర్సింలుబాబు 64 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ సాధించారు. ఈ మేరకు ఉస్మానియా వర్సిటీ నుంచి జియాలజీ విభాగంలో డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా(జీయాలజీ) ఆరేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఎర్రోళ్ల నర్సింలుబాబు భూగర్భ శాస్త్ర ప్రొఫెసర్ జి.ప్రభాకర్ పర్యవేక్షణలో 'వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలోని గంగకత్వ ప్రవాహ బేసిన్‌లో ఒకేలాంటి జల, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న లాటరైట్, బసాల్ట్, గ్రానైట్ రాతి నిర్మాణాలపై మైనర్ ఇరిగేషన్ చెరువుల సామర్థ్యాన్ని అంచన వేయడం' అనే అంశంపై పరిశోధన చేశారు.

జవాన్ల కుటుంబాలకు అండగా ఉంటాం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- మెదక్‌లో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని. మన దేశ సైనికులకు సంఘీభావంగా మంగళవారం సాయంత్రం మెదక్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మువ్వన్నెల జెండాలను పట్టుకొని స్థానిక గుల్షన్‌క్లబ్ నుంచి ప్రారంభమై రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. వందేమాతరం, భరత్‌మాతకీ జై అంటూ నినాదాలు మర్మోగాయి. పహల్గాం దాడిలో అరుమలైన వారిని, యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లు స్మరిస్తూ.. రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు భారతవైపు కన్నెత్తి చూడకుండా జవాబిచ్చామన్నారు. దేశ భద్రత, దేశ ప్రజల రక్షణ కోసం సరిహద్దుల్లో కవచంగా మారి కాపలా కాస్తున్న వారికి కోసం, దేశ కోసం వీర మరణం పొందిన జవాన్ల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. భారత్ జోలికొస్తే తరిమికొడతామన్నారు. ఆడబిడ్డల సిందూరాన్ని తుడచాలని చూస్తే.. ప్రపంచ పటంలో పాకిస్థాన్‌ను లేకుండా చేస్తామన్నారు. పదేండ్ల కాలంలో దేశం మేకిన్ ఇండియా పేరిట గన్‌ల నుంచి మిసైల్స్ వరకు మన భాగ్యనగరంలోనే తయారు చేసుకుంటున్నామన్నారు.మోదీ నాయకత్వంలో మేకలు కూడా పులుల వలే పోరాడుతాయనడానికి పహల్గాం ఘటననే నిదర్శమనమన్నారు దేశంలో గూఢాచారులు ఉన్నారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం వస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, సీనియర్ నాయకులు పంజా విజయ్, రాగి రాములు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సతీష్‌పటేల్, సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు రాము, మల్లారెడ్డి, శీణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దరోడ్డు ఇంకెప్పుడో?

సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల శివారులో ప్రమాదకర ప్రయాణం



(5వ పేజీ తరువాయి)

వెలువడటంతో వాహనాలకు దారి కానరావడం లేదు. ఇక రోడ్డు పక్కన నిర్మించిన డ్రైనేజీల్లో వాహనాలు కూరుకుపోతున్నప్పటికీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. దుమ్మూధూళిని నియంత్రించేలా నీళ్ల చల్లడం లేదు. ఇప్పటికే పలువురి మృత్యువాతకు కారణమైన ఈ రహదారి పనులకు మరెంత మంది ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన పనులు

రెండేళ్ల వ్యవధిలోనే ఈ పనులు చేపట్టాలని అప్పట్లో లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ రెండున్నరేళ్లు గడుస్తున్నా పనులు సాగుతూనే ఉన్నాయి. మరో ఏడాది గడిస్తేనే హైవే నిర్మాణం పూర్తయ్యేలా కనిపిస్తోంది. సిద్దిపేట, హుస్నాబాద్ పట్టణాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులను అస్తవ్యస్తంగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం త్వరితగతిన భూసేకరణ చేసి కాంట్రాక్టర్లకు అప్పగించింది. కానీ పనులు పూర్తి చేయడంలో మాత్రం వేగిరపడట్లేదనే విమర్శలు ఉన్నాయి. మూలమలుపులు, ఎత్తుపల్లాల రోడ్లు ఈ హైవే నిర్మాణంలో భాగంగా వెక్కిరిస్తున్నాయి.



హుస్నాబాద్ డిపోక్రాస్ వద్ద ప్రమాదకరంగా డ్రైనేజీ

కోహెడ మండలం సముద్రాల క్రాసింగ్ వద్ద పూర్తికాని ప్యాచ్ వర్క్ పనులు



న్యూస్ బాక్స్

నర్సరీలు, డంప్‌యార్డుల పరిశీలన

నిజాంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రతి పైసాకు సంబంధించి వివరాలను పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం చల్మెడ గ్రామాన్ని సందర్శించిన ఆయన రికార్డులు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని, తడి, పొడి చెత్తలను వేరుచేసి డంప్ యార్డ్‌కు తరలించి వర్మి కంపోస్ట్ తయారీకి ఉపయోగించాలని పంచాయతీ కార్యదర్శి నిర్వాహకులకు సూచించారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

నర్సాపూర్, మే 20(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వాడకం మానుకోవాలని లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ పేర్కొన్నారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న, ప్లాస్టిక్ సామగ్రి అమ్ముతున్న దుకాణ యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నివారించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నామని, ఇందుకు వ్యాపారులు సహకరించాలన్నారు.

పేదింటి వధువుకు ఆర్థికసాయం

రామాయంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ వార్డు సభ్యుడు చాకలి వెంకటి ఏడాది క్రితం చనిపోగా.. అతడి కూతురు పెళ్లి సమయంలో అండగా ఉంటానని రామాయంపేటకు చెందిన పుట్టి సందీప్ ఆ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చాడు. బుధవారం వెంకటి కూతురు హేమలత వివాహం జరగనుండగా.. మంగళవారం రూ.25వేలను ఆ కుటుంబసభ్యులకు ఇచ్చి అండగా నిలిచాడు సందీప్. తన తల్లి బాలమణి జ్ఞాపకార్థం ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలవడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నాడు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా సంపూర్ణ

తూప్రాన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మన్నె సంపూర్ణ (వెంకటాయపల్లి) ఎన్నికైనట్లు ఐకేపీ ఏపీఎం రుక్మిణి తెలిపారు. డీఆర్డీవో డీపీఎం ఐబీ కెనడీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. 15 గ్రామైఖ్య సంఘాలు ఓటింగ్ పద్ధతిలో ఎన్నికల్లో పాల్గొని ఓటింగ్ చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యదర్శిగా అంబటి రోజా (ఇస్లాంపూర్), కోశాధికారిగా చెర్రి నర్మదా (యావాపూర్) లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. బైలా ప్రకారం ప్రమాణస్వీకారం నిర్వహించారు.

శిక్షణతోనే నాణ్యమైన విద్యాబోధన



సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు



తూప్రాన్‌లో ఉపాధ్యాయ శిక్షణకార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

సంగారెడ్డి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): శిక్షణతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చేయడం ద్వారా పాఠశాలల్లో విద్యాబోధన మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. మెరుగైన విద్యాబోధనతోనే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా రెండో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జి తుకారం, కంది ఎంఈవో జోగప్ప, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, ఆర్‌పీలు రవీందర్‌రెడ్డి, వహీద్, పాషా, నారాయణమూర్తి, వెంకటరాజయ్య పాల్గొన్నారు.

మండలస్థాయిలో ప్రారంభమైన శిక్షణ

● **కల్హేర్/నారాయణఖేడ్:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన కోసం ఉపాధ్యాయులకు ఇచ్చే వృత్యంతర శిక్షణ కార్యక్రమం సంగారెడ్డి జిల్లాలోని ఆయా మండలాల్లో మంగళవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీలకు అయిదు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. జిల్లా స్థాయిలో శిక్షణ తీసుకున్న రిసోర్స్ పర్సన్‌ల చేత వీరికి ఎఫ్ఎల్ఎన్ కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ ఇచ్చి మెరుగైన విద్యా బోధన అందించేలా శిక్షణ ఇస్తారు. కాగా మంగళవారం కల్హేర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఎంఈవో శ్రీనివాసులు, సిర్గాపూర్ మండలంలోని కేజీబీవీలో ఎంఈవో నాగారం శ్రీనివాస్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నారాయణఖేడ్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో విశ్వనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణకు అందరూ విధిగా హాజరు కావాలన్నారు. రిసోర్స్ పర్సన్లు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

మెదక్ జిల్లాలో..

నర్సాపూర్/శివ్వంపేట/పెద్దశంకరంపేట/రేగోడు/తూప్రాన్/మనోహరాబాద్/వెల్దుర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): ఐదురోజుల పాటు ఇస్తున్న శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లల ఉపాధ్యాయులు విద్యార్థులకు నేర్పించి వారికి నాణ్యమైన విద్య అందేలా చూడాలని నర్సాపూర్ ఎంఈవో తారాసింగ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో తారాసింగ్ ప్రారంభించి మాట్లాడారు. శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కుల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో బుచ్యానాయక్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో మండల పరిధిలోని ఎస్జీటీ ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి వెంకటేశం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. రేగోడు ఉన్నత పాఠశాలలో ఎంఈవో గురునాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల శిక్షణ నిర్వహించారు. తూప్రాన్‌లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని తూప్రాన్ ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మనోహరాబాద్‌లోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈవో మల్లేషం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వెల్దుర్తి మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో యాదగిరి ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తనిఖీ



కల్హేర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏవో వెంకటేశం, ఏఈవోలు

కల్హేర్/నాగల్‌గిద్ద, మే 20(ఆంధ్రజ్యోతి): కల్హేర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం మంగళవారం తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని ఐకేపీ వీవోఏ బాలమణికి ఆయన సూచించారు. వెంట ఏఈఓలు సంతోషకుమారి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నాగల్‌గిద్దలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్, ఏవో ప్రవీణ్‌చారితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఫర్టిలైజర్ల షాప్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి, వారికి పలు సూచనలు చేశారు.

● **చిన్నశంకరంపేట:** తూకం వేసిన వరి ధాన్యాన్ని వెనువెంటనే రైస్ మిల్లకు తరలించాలని తహసీల్దార్ మన్నన్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వెంకట్రావుపల్లి, శాలిపేట, తదితర గ్రామాల్లో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయే పరిస్థితి ఉన్నందున రైతులు ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మిల్లర్లు వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

వెల్దుర్తి, మే20(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందరంభంగా ఆర్డీవో మాట్లాడుతూ... హమాలీలను పెంచి ధాన్యం వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తూప్రాన్ డివిజన్‌లోని ఆరు మండలాలలో 80 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో 32 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్టు చెప్పారు. ఇప్పటివరకు 431291.04 క్వింటాళ్ల ధాన్యంను కొనుగోలు చేసినట్టు చెప్పారు. 6,608 మంది రైతుల ఖాతాల్లో ధాన్యం విక్రయించిన డబ్బు కూడా జమ అయ్యిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రైస్‌మిల్లర్లు ఉన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నిజాంపేట రైతువేదికలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం 32 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, మాజీ సర్పంచ్ అమర్ సేనా రెడ్డి, పంజా మహేందర్ నసీరోద్దీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

● **టేక్మాల్:** టేక్మాల్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో గల రైతువేదికలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

నారాయణఖేడ్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో వాటర్‌మెన్, ఎలక్ట్రిషియన్, డ్రైవర్లుగా పని చేస్తున్నవారికి కనీస వేతనాలను ఇవ్వాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో సంబంధిత సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖేడ్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు సక్రమంగా అమలు కాక పోవడం, పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె, బెల్లం, టవళ్లు, చెప్పులు, గుర్తింపు కార్డులు తదితర కనీస సదుపాయాలు అమలు కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ జగ్జీవన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, సాయిలు, గోపాల్, శేఖర్, ప్రవీణ్, నారాయణ, ఆదాం, సంగన్న పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద కూలీలకు వసతులు



కామారంలో టెంటు సౌకర్యం కల్పించిన ఉపాధిహామీ సిబ్బంది

చిన్నశంకరంపేట మే 20 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతతో ఉపాధి పనులు నిర్వహిస్తున్న చోట కూలీల ఇబ్బందులకు సంబంధించి 'ఉపాధి కూలీలకు వసతులు కరువు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం కామారం, గవ్వలపల్లి, జంగరాయి, తదితర గ్రామాలను సందర్శించి ఏపీవో రాజుకుమార్ సిబ్బందితో కలిసి పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేశారు.

చేగుంటలో సామాజిక తనిఖీ

చేగుంట మే 20 (ఆంధ్రజ్యోతి) మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం 4వ విడత సామాజిక తనిఖీని అధికారులు మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్‌రావు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. మండల ప్రత్యేక అధికారి దామోదర్, డీవీవో శ్రీహరిగౌడ్, జేక్యూసీవో అరుణ, హెచ్‌ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ తిరుపతి తనిఖీలో పాల్గొన్నారు. తనిఖీ అనంతరం డీఆర్డీవో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మండలంలోని మొత్తం 9 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులకు సంబంధించి లెక్కలు పరిశీలించామన్నారు. సంవత్సర కాలానికి రూ. 3,75,47,382 విలువైన పనులు జరిగాయని అందులో కూలీలకు రూ.3,37,19657 కూలీలకు చెల్లించారని, మిగతా రూ.4,25728 పనులకు సంబంధించిన వస్తువులకు ఖర్చయ్యిందన్నారు. తనిఖీల్లో కొన్ని చోట్ల జాబ్ కార్డులు డబుల్ వచ్చాయని, అలాగే ఒకరి కార్డుపై మరొకరు వేరొకరు పనులు చేస్తున్నారని, కొన్ని చోట్ల అధిక కూలీలు చెల్లించారని, ఇలాంటి పొరపాట్లను వెంటనే సరి చేసుకోవాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో నీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అమర్చే బాధ్యత గ్రామ పంచాయతీలదేనని, తప్పకుండా సమకూర్చాలని ఆదేశించారు. కొన్ని తప్పిదాల వల్ల రూ.21,913 రికవరీ, 20 వేలు జరిమానా విధించి, సిబ్బందికి షో కాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమానికి అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు హాజరయ్యారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

చిన్నశంకరంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎంఈవో పుష్పవేణి పేర్కొన్నారు. జూన్ 6 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆయా గ్రామాల ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించనున్నట్టు తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటూ పనులు చేసుకుంటున్న పిల్లలను ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్‌లో జాయిన్ చేయనున్నట్టు తెలిపారు. అలాగే ఉల్లాస్ నవభారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను గుర్తించి స్వచ్ఛంద బోధకులచే తరగతులను నిర్వహిస్తామన్నారు. 15 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఇంటింటికీ వెళ్లి చదువు పట్ల అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు సహకరిస్తారన్నారు. విద్యా పట్ల పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించారు.

అంబాజీపేటలో రేణుకా ఎల్లమ్మ కల్యాణం



మక్త భూపతిపూర్ ఉత్సవాల్లో పద్మారెడ్డి

చిన్నశంకరంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): గౌడ సంఘం ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ ప్రతిష్ఠాపనోత్సవం, అమ్మవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 17న ప్రారంభమయ్యాయి. సంగమేశ్వర శర్మ పండితులు డప్పు సప్పుల మధ్య రేణుక ఎల్లమ్మ జమదగ్ని కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఎమ్మెల్యే రోహిత్ రావు, కాంగ్రెస్ శ్రేణులు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

నల్లపోచమ్మ జాతర

మెదక్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ మండల పరిధిలోని మక్త భూపతిపూర్ గ్రామంలో మంగళవారం శ్రీ నల్ల పోచమ్మ జాతర బండ్లు, బోనాల ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టయ్య, గ్రామాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, మండల ప్రచార కార్యదర్శి మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టేక్మాల్: బోడ్మాట్‌పల్లిలో పాచిబండ్ల ఊరేగింపు

ముగిసిన వీరభద్రుడి ఉత్సవాలు

టేక్మాల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోడ్మాట్‌పల్లి గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లంకదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున బానసంచా కాల్చారు. ఉదయం పాచిబండ్లు డోలు సన్నాయి, డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు నృత్యాలు చేశారు.

బాధితులకు భరోసా కల్పించాలి



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు భరోసా కల్పించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ విధానం, దృష్టి సారించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియజేశారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడండి



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్‌తో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి ప్రజల సమస్యలను తీర్చాలన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని, పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

● మెదక్ జిల్లా ఎన్నికల పరిశీలకుడు వరప్రసాద్

కొల్చారం, మే 20 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుందని జిల్లా ఎన్నికల పరిశీలకుడు వరప్రసాద్ తెలిపారు. మంగళవారం కొల్చారంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు కోసం దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, మాజీ జడ్పీటీసీ శేషసాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు ఉన్నారు.

పంట మార్పిడితో అధిక లాభాలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

జోగిపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): యూరియా అవసరమైనంతే వాడుకుని సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని, పంట మార్పిడి వల్ల అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. అందోల్ మండల పరిధిలోని ఏరువాక కేంద్రం సంగుపేట, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల కందివారి ఆధ్వర్యంలో కోటాల గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేతలు - అన్నదాతల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ హాజరై మాట్లాడారు. అవసరం మేరకు రసాయనాలను ఉపయోగించుకుని నేలను కాపాడాలన్నారు. శాస్త్రవేత రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ రైతులు పంట అవసరాల నిమిత్తం దుకాణాల వద్ద కొనుగోలు చేసేటప్పుడు రసీదులను భద్రపరుచుకోవాల సూచించారు.

ఎరువుల పంపిణీలో స్పష్టత ఉండాలి: ఏడీఏ

జహీరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న నేపథ్యంలో ఆయా ఎరువుల దుకాణాదారులు ఎరువుల పంపిణీలో స్పష్టత ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్‌లో ఎరువుల దుకాణాల నిర్వాహకులకు ఈ-పాస్ మిషన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జహీరాబాద్ ప్రాంతం కర్ణాటక,మహారాష్ట్రలకు చేరువలో ఉన్నందున ఎరువులు, విత్తనాలు పక్క రాష్ట్రాలకు తరలించే అవకాశం ఉన్నందున దుకాణాలనిర్వాహకులు ఆధార్‌కార్డును ఈపాస్ మిషన్‌లో లింక్‌చేశాకే రైతులకు ఎరువులను అంద జేయాలన్నారు. దుకాణాల నిర్వాహకులు రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, మే 20(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి హేమలత పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నర్సాపూర్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు ఉన్న చట్టాలు తద్వారా వారు ఎటువంటి న్యాయం పొందవచ్చు అనే అంశాలను వివరించారు. అదేవిధంగా నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల అశోక్‌కు చెందిన భూమి భూ రికార్డులలో ఇతరుల పేరు నమోదు కావడంతో ఇబ్బందులు పడుతూ మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయించగా లీగల్ సర్వీసు ద్వారా రికార్డులు పరిశీలించి వాటిని సరిచేసి పాస్ బుక్కును సదరు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ లేబర్ ఆఫీసర్ సత్యానంద్,న్యాయవాదులు ఇక్బాల్‌అలీజాఫర్, శ్రీనివాస్‌రెడ్డి, మధుశ్రీ, సాయిరాం, రవి, అజంఅలీబేగ్, సూపరిండెంట్ జలీల్‌హైమద్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

చేగుంట మే 20 (ఆంధ్రజ్యోతి): చేగుంట గాంధీ చౌరస్తా వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని మంగళవారం లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దూరి లక్ష్మీనరసింహయ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జిన్నారం, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాజీపల్లి టీఐడీసీ పరిశ్రమ వద్ద సీఐటీయూ రాష్ట్రకమిటీ సభ్యుడు రాజయ్య ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం తీసుకువచ్చిన నాల్గు కార్మిక వ్యతిరేక కోడ్‌లతో కార్మిక వర్గానికి తీరని నష్టం జరుగనుందని, కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముత్యాలు, గట్టయ్య, అడివయ్య, దశరథ్, మల్లేశం, జీతయ్య పాల్గొన్నారు.